## ఎడతెగని వర్షంలో—

లైట్ల వెలుతురులో తడుస్తున్న రోడ్డుపై—

తడుస్తూ, తలవంచుకుని వస్తున్న మనిషి.... అతనే.

మళ్ళీ ఒకసారి పరిశీలనగా, తదేకంగా గమనించాను. సందేహం లేదు. అతనే — రాఘవయ్యే.

ఎందుకో జాలీ, సానుభూతీ, ప్రేమ, గౌరవం, అభిమానం అన్నీ కలగలసిపోయిన ఓ మహాద్భుతమైన అనుభూతి హృదయాన్ని స్పృశించి ఓ రకమైన పులకింత కలిగింది.

నాకు తెలుసు— అతను నా దగ్గరకే వస్తున్నాడని- వస్తాడనీ.

కిటికీ నుండి చూపులు మరల్చుకొని టేబుల్‌పై పేర్చబడివున్న అనేక ఉత్తరాల కట్టలవంక చూశాను. వెనకనుండి నేపథ్యంగా విరామం లేకుండా ప్రెస్ చప్పుడు వినబడుతోంది. సంపాదకుడుగా నాకున్న నాగది గాజు తలుపుల కవతల స్టాఫంతా వెళ్ళిపోయాక మిగిలిన ఖాళీ కుర్చీలు, ఇంకో రెండ్రోజుల్లో మార్కెట్లోకి విడుదలయ్యే తరువాతి పత్రిక సంపాదకీయం ప్రూఫ్ చూస్తూ అసోసియేట్ సత్యం, టెలిప్రింటర్ ఆపరేటర్ వాసు కనిపిస్తున్నారు.

# రామచంద్రమౌళి ఋణానుబంధం

ఒక్క ప్రెస్ చప్పుడు తప్పితే గంభీరమైన నిశ్శబ్దం.

వర్షం వల్ల చల్లగా తేమ నిండిన వాతావరణం, అప్పుడప్పుడు వీస్తున్న ఈదురు గాలి, పత్రిక, సర్క్యులేషన్ పెరుగుతున్నందుకు నా సంపాదకత్వాన్ని ప్రశంసిస్తూ యాజమాన్యం రాసిన లేఖ- ఎదురుగా.... మనసంతా సందడిగా వుంది.

సిగరెట్టు వెలిగించుకుని- గుండెల నిండా పొగపీల్చుకుని- హాయిగా వెనక్కివాలి పాఠకుల ఉత్తరాల కట్టను తీసుకున్నాను చేతిలోకి.

గత రెండు వారాల క్రితం విడుదలైన దీపావళి ప్రతేక సంచిక బాపతు ప్రతిస్పందనలవి. మొదటి ఉత్తరం.... రాఘవయ్య రాసిన 'హృదయం' కథ గొప్పతనాన్ని గురించి ఎవరో గొప్పగా విశ్లేషిస్తూ రాసింది. ఇంకో ఉత్తరం ....దాంట్లోకూడా 'హృదయం' గురించే ప్రశంస. యాంత్రికంగా ఉత్తరాలను తిప్పుతున్న కొద్దీ ఎక్కువగా రాఘవయ్య కథ గురించే ప్రస్తావన- ఏముందా కథలో అనిపించింది.

నిజానికి దీపావళి సంచిక ప్రకటన వేస్తున్నపుడు వేసిన రచయితల జాబితాలో సాధారణ ఖాతా క్రింద రాఘవయ్య పేరు వెలువడింది. ఆ తర్వాత తన సాధారణ ధోరణిలో రాఘవయ్య వస్తూ తోచినంత డబ్బు నన్నడిగి తీసుకుని వెళ్ళడమేగాని మ్యాటర్ యిక రేపు ప్రెస్‌లోకి వెళ్తోందనగాకూడా తన కథను అందివ్వలేదు. పేరేమో ప్రకటించబడింది. అచ్చుపని ప్రారంభమైంది. మనిషి పత్తాలేడు. కుర్రాడితో కబురు చేశాను. ఆరోగ్యం బాగుండక పోవడంతో హాస్పిటల్ కెళ్తే డాక్టర్లు బలవంతపెట్టి అడ్మిట్ చేయించారని తెలిసింది. నిజానికి కథా సాహిత్యంతో పరిచయమున్న ఎవరైనా రాఘవయ్యను కలుసుకోవటం తటస్థిస్తే అభిమానంతో కూడిన సంతోషంలో ఉక్కిరిబిక్కిరైపోయి ఘనంగా ఆదరిస్తారు. అతని కథల్లో ఆ. జీవం ఉంది. జీవితం ఉంది. వేదన ఉంది. కన్నీళ్ళున్నాయి. హృదయాన్ని స్పృశించి మైమరపింపజేసే మహత్తు ఉంది.

వెంటనే ఆ రాత్రి రాఘవయ్యను పరామర్శించి, దీపావళి సంచికకు కథ గురించి వాకబు చేద్దామని హాస్పటల్‌కు వెళ్ళాను. తీరా వెళ్తే అతనక్కడ లేడు. డాక్టర్లతో చెప్పాపెయ్యకుండా ఎటో వెళ్ళిపోయాడట. యింటికి వెళ్తే అక్కడా లేడు. భార్య ఉంది అస్పత్రి నుండి రాఘవయ్య ఎటో వెళ్ళిన సంగతి తనూ విన్నట్టూ ఐతే అలా చెప్పకుండా ఎటెటో పోవడం కొత్త సంగతేమీకానట్టూ చెప్పింది. పిల్లలు లేరతనికి. అందువల్ల నేనేమో రాఘవయ్య భార్య ఎప్పుడూ భావశూన్యంగా కనిపిస్తుంది. అతనొక ఋషి, పసిపిల్లాడు. ఈ లోకంలోనే ఉంటూ తనదైన ఓ మహా ప్రపంచంలో జీవించే మహర్షి.... ఈ జన్మకు అతను చాలు- అంటుందామె. ఎప్పుడైనా పిల్లల ప్రస్తావనొస్తే- కాలేజీలో చదువుకునే నా విద్యార్థులందరూ నా పిల్లలే, నాకు యింక వేరే పిల్లలెదుంకు అంటాడు అతను.

ఆ రోజు రాత్రి- విచిత్రంగా.... మూడున్నర గంటలకు బజర్ మ్రోగితే, అడిగి తలుపు తీశాను. ఎదురుగా రాఘవయ్య పోర్టికో క్రింద- ఎర్రగా కళ్ళు.... అలసిపోయిన ముఖం.... నలిగిన బట్టలు.

చేతిలోని కవర్‌ను అందించి "సారీ.... ఆలస్యమైపోయింది" అన్నాడు.

అప్పుడే విస్కీ వాసన గుప్పుమంది.

గౌరవం-అసహ్యం.... పూజ్యభావం.... ఈ సడింపు మిశ్రితమై ఏదీ తోచనిస్థితి మనసునిండా.

"మీ దగ్గరనుండి తీసుకున్న డబ్బంతా కలిపి మూడువందల ఇరవై ఈ కథ రెమ్యునరేషన్ పోతే నేనే మీకు డెబ్బయి రూపాయలు బాకీ-తీర్చుకుంటాను బాకీ....త్వరలో...."

వెనక్కి తిరిగి గేటు తెరచుకుని.... వెళ్తున్నాడు.

అయ్యో పాపం....అనిపించి....

బలహీనతలలో చిక్కుకుని జయించలేని ఈ మనిషితో ఏంలే....అనిపించి- వ్యక్తిగతంతో ఏంపని, అతనిలోని మహారచయితతో కదా ఓ సంపాదకునిగా, పాఠకునిగా, ఓ సాహిత్యాభిమానిగా, సాటి సాహిత్యకారునికిగా అతనితో సంబంధం....ప్చ్....ఏమిటో, అదో రకమైన అనుభూతి.

అలాగే నిల్చున్నాన్నేను....వీధి మలుపు తిరిగి వెళ్తూ ఇంకా కనిపిసూనే ఉన్నాడు రాఘవయ్య.

గమ్మత్తయిన విషయమేమిటంటే....ఏ పత్రికయినా ఓ రచయిత పంపిన కథని పరిశీలించి ప్రచురించుకుని తర్వాత పిలునిబట్టి పారితోషికొన్ని పంపుంది. కాని ఈ నగరంలోని దాదాపు అన్ని పత్రికలకూ, రాఘవయ్యకూ నడుమ ఉన్న సంబంధం అలాంటిది కాదు. అతనికి తాగడానికి డబ్బవసరమున్నదల్లా వస్తాడు. తీసుకుంటాడు. ప్రతిగా ఎప్పుడో ఒకప్పుడు ఓ బ్రహ్మాండమైన కథ



రాసిస్తాడు. ఆ కథ ఆ సంచికకు మకుటమై నిలుస్తుంది. కలకాలం జ్ఞాపకం ఉండిపోయే మధురానుభూతిగా పాఠకుల మనసుల్లో నిలిచి పోతుంది. తర్వాత బాకీ బేరీజు వేసుకుని మొత్తంమీద బ్యాలన్స్ ఎక్కువ లేకుండా కథలతో బాకీని చుక్తా చేస్తాడు. ఎప్పుడైనా అసాధారణ సందర్భాల్లో రాఘవయ్య ఖాతాలో బాకీ ఎక్కువగా పేరుకుపోతే ఏదో ఓ కథలపోటీలో అవార్డు ప్రకటించి ఆయాసంపాదకులు బ్యాలెన్స్ షీట్‌ను సరిచేసుకుంటారు. నిజంగా బహుమతులే ఇవ్వదలుచుకుంటే అతను రాసే ప్రతి కథా అవార్డు కథే....ఆ శైలి....ఆనడక.... ఆ సంవిధానం. ఎన్నుకునే ఆ ఇతివృత్తాలు అవన్నీ అతనికే చెల్లాయి.

ఐతే - ఇంతా చేసి ఈ పుచ్చుకున్న డబ్బును ఏం చేస్తాడయ్యా-అంటే, తాగుతాడు. కేవలం తాగుతాడు.

అసలితను రాయడం కోసం తాగుతాడా?

తాగడం కోసం రాస్తాడా - అంటే జవాబు చెప్పడం కష్టమవుతుంది. ఎలా రాసినా బ్రహ్మాండంగా రాస్తాడన్నది మాత్రం నిజం-

అప్పటికే ఆ రాత్రి అలా ఆవేశనంగా నిలబడి చూస్తూండడంతో ఇంట్లోవాళ్ళు పిలవడం-లోపలకెళ్ళి....మర్నాడు యధాలాపంగా కథను చదవకుండానే ప్రెస్‌కు పంపడం, అది అచ్చయి వెళ్ళిపోయి-

ఇప్పుడు ఉత్తరాలు చూస్తుంటే చదవాలని పించి సొరుగులోనుండి దీపావళి సంచికను తీసి పేజీలు తిప్పాను.

ఓ పేజీ చదివానో లేదో-

తలుపు చప్పుడైతే తలెత్తాను.

నేనూహించినట్టుగా అతనే - రాఘవయ్య. మొత్తం పూర్తిగా తడిచి తలపైనుండి నీళ్ళ ధారలు కారుతుండగా నిలబడి-

"రండి....అరే పూర్తిగా తడిచిపోయారే.... తుడుచుకోండి" కుర్చీపైన వున్న టర్కీటవల్ అందించాను.

తీసుకుని తుడుచుకుని - కూర్చున్నాడు.

"మీ కథ చాలా బాగుందని - ఇదిగో ఇన్ని ఉత్తరాలొచ్చాయి" అన్నాను ఉత్సాహంగా.

వింటున్నాడు-కాని ఎలాంటి ప్రతిచర్యాలేదు.

"నేనూ చదువలేదు. ఇప్పుడే చూస్తున్నాను అందరూ బాగుందంటూంటే...."

ఒట్టి మౌనం.

"ఇంత వర్షంలో వచ్చారేమిటీ"

"ఓ యాభయ్ కావాలి

నాకు తెలుసు సరిగ్గా అటువంటి డైలాగే వస్తుందని-

అబ్బా - తాగుడు కోసం ఈ మనిషి ఇంత దీనంగా, పూర్తిగా ఉనికినీ, ఉన్నతినీకోల్పోయి అర్థిస్తూ-

"ఇప్పుడు మీ ఆరోగ్యం ఎలా వుంది."

"..............." మౌనమే.

ఇక లాభం లేదని పాకెట్‌లో నుండి యాభై రూపాయల నోటిచ్చి—

తీసుకుంటూనే లేస్తూ 'థాంక్యూ' అన్నాడు.

చూస్తూండగానే....కురుస్తున్న భారీ వర్షాన్ని లెక్క చేయకుండా వెళ్ళిపోయాడు రోడ్డుపైకి.

* * * *

రాఘవయ్య బయట హుషారుగా జనంతో కబుర్లు చెప్పుకుంటూ కనిపించడం నాకతనితో వున్న పదిహేనేళ్ళ పరిచయంలో ఎప్పుడూ జరగలేదు. ఎప్పుడు కనబడ్డా మౌనంగా నడిచి వెళ్తూనో, ఎక్కడైనా ఏదో పుస్తకం చదువుతూనో తటస పడ్డాడు

ఐతే కాలేజీ క్లాస్ రూంలో పాఠాలు చెప్తున్నప్పుడు గానీ, బయట ఎక్కడైనా ఎవరైనా సాహిత్యోపన్యాసాలు ఏర్పాటు చేసేప్పుడు గానీ అతని వాక్పటిమ, విషయ శుద్ధి, అనర్గళమైన పద ప్రవాహం, విస్తృతమైన జ్ఞాన సౌందర్యం మనల్ని ముగ్ధుల్ని చేస్తాయి. ఇచ్చిన విషయంపై సహేతుకమైన చర్చతో మనతో తలాడింప చేస్తాడు.

అందుకే....

ఆరోజు....రాఘవయ్య రాసిన కథల సంపుటిని భారతీ పుస్తక సంస్థ వాళ్ళు ప్రచురించిన సందర్భంగా, ఆవిష్కరణ సభను ఏర్పాటు చేస్తే వెళ్ళాను.

సభా ప్రారంభంలో రాఘవయ్య దంపతులకు

ఓ చిన్నపాటి సన్మానం చేశారు. ఆ సరంపరలో రాఘవయ్య భార్య పార్వతి రెండు మాటలు మాట్లాడింది.

"రాఘవయ్య ఓ యోగి. అతని భార్య, పిల్లలు, సంసారం, ఉద్యోగం, జీవితం, జీవం- అన్నీ కథే. భౌతికంగా కనిపించే భార్య రూపంలో వున్న తనుగానీ, తమచుట్టూ వున్న ప్రపంచం గానీ రాఘవయ్య దృష్టిలో ఓ మిథ్య అనీ, కథ రాయడానికి పుట్టి, కథ రాయడానికి బ్రతికి. కథ కోసమే ఆయన మరణిస్తాడనీ" అంది.

నిజం చెప్పాలంటే రాఘవయ్యంటే అక్షరాలా అంతే.

ఆ తర్వాత చివరి వక్తగా గంటన్నర సేపు కథా సాహిత్యంపై రాఘవయ్య చేసిన ఉపన్యాసం ఓ విశిష్టమైన పాఠం. ఆ విశ్లేషణ ఉపమానాలూ, ఉటంకనలూ, కథ రాయడానికి ఓ ఉత్తమ కథకుడు పొందవలసిన వేదన, కథ ప్రభావం .... ఎన్ని చెప్పాడో....చెప్పి ఒప్పించాడో....వహ్వా అనిపించాడు.

సభానంతరం రాఘవయ్య దంపతులను ఆటోలో పంపిస్తూ భారతీ పుస్తక సంస్థ అధినేత కోటేశ్వరరావు రాఘవయ్యకు ఇష్టమైన ఓ.టి. విస్కీ బాటిల్‌ను ఇవ్వడం నాకు కనిపించింది.

తర్వాత,

పత్రికా సంపాదకులమైన మాతోపాటు మరి కొందరు ముఖ్య మిత్రులతో ఓవిందును ఏర్పాటు చేశాను.

మందు మనసునిండా ఎక్కినతర్వాత- కోటేశ్వరరావు చెప్పాడు- "పిచ్చోడు రాఘవయ్య పాపం. అప్పుడో యాభై అప్పుడో వంద తీసుకుని మొత్తం వేయిరూపాయలకే కథాసంపుటిపై ఫుల్ రైట్సిచ్చాడు. ఓ రోజు మందుకు ఎవరూ డబ్బివ్వకుంటే బ్లాంక్ పేపర్‌పై సంతకం చేసిచ్చి ఇరవై ఐదు తీసుకున్నాడు. కథాసంపుటికి వేరే వాళ్ళయితే- ఏ రైటరైనా కనీసం ఐదువేలు తీస్కుంటారు. తమాషా ఏంటో తెలుసా ఎడిషన్ మొత్తం ఓ నెలలో ఖాళీ ఔతుంది....పిచ్చోడు...."

జాలితో నిండిన రిక్తత మనసునిండా.

రాఘవయ్యవల్ల పత్రికలూ, ప్రచురణకర్తలు బాగుపడుతున్నారా?

లేక పత్రికలవల్ల అప్పుడప్పుడు డబ్బు యిస్తు మెచ్చినప్పుడు అడుక్కుని రాఘవయ్య ఆనందపడుతున్నాడా?

ప్చ్...., ఏమో.

* * *

ఉగాది ప్రత్యేక సంచిక ప్రెస్ వర్క్- ప్రారంభమైంది. రచయితల లిస్టులో రాఘవయ్య పేరును ప్రముఖంగా ప్రకటించాం. కాని ఇంత వరకూ కథ మనకందలేదు...." చెప్తున్నాడు అసోసియేట్ సత్యం.

ఆపరేటర్‌కు ఫోన్‌చేసి రాఘవయ్య పనిచేసే కాలేజీకి కనెక్షన్ యిమ్మన్నాను. ఈలోగా ఆఫీస్ నుండి అకౌంట్ తెప్పించి చూస్తే అతని పేర నాల్గువందల రూపాయలు సంస్థకు బాకీ ఉన్నాయి.

ఫోన్‌లో ప్రిన్స్‌పాల్ మాట్లాడాడు. పదిరోజులైందట రాఘవయ్య హాస్పిటల్‌లో చేరి. పరిస్థితి ప్రమాదకరంగా ఉందనికూడా చెప్పాడు.


అప్పుడు జ్ఞప్తికి తెచ్చుకుంటే.... రాఘవయ్య కనిపించక, డబ్బు కావాలని రాక చాలా రోజులైందని పించింది. మనసునిండా ఏదో వెలితి. ఎవరో అత్యంత ఆత్మీయుల్ని కోల్పోతున్నట్టు భావన. శూన్యత.

అసంకల్పితంగానే లేచి కారు తీసుకుని రాఘవయ్య ఉన్న ఆస్పత్రికి వెళ్ళాను.

ఐతే అప్పటికే అంతా అయిపోయింది. రాఘవయ్య అంతిమ శ్వాస విడిచి పది నిముషాలైంది. ప్రక్కన ఒక్క భార్య మాత్రమే వుంది మౌనంగా రోదిస్తూ.

నన్ను చూసి.... పలుసార్లు నన్ను చూచిన చనువుతో.... "హాస్పిటల్ వాళ్ళు బిల్లు కట్టి శవాన్ని తీసుకు పొమ్మంటున్నారు. నా దగ్గరేమీ...." మాటలను కన్నీళ్ళు మింగేశాయి.

కథను- ఊపిరిగా, ఉద్యమంగా, జీవంగా, జీవితంగా, ఆరాధించి, వందల కథలతో లక్షల పాఠకులను రంజింపచేసిన మహావ్యక్తి శరీరం ....మృత శరీరం.... తాకట్టులో....




**ఆరెస్టు**

రాము అప్లికేషన్ ఫామ్ నింపుతున్నాడు.

"ఎ పు డై నా అరె స్ట యాడా?" అని వున్న చోట 'లేదు' అని వ్రాసాడు.

దాని క్రిందే "ఎందువల్ల?" అన్న వున్నచోట "పట్టుపడనందు వల్ల" అని వ్రాశాడు.

ఎందుకో కన్నీళ్ళు జలజలా రాలాయి.

నర్సింగ్‌హోం ఆఫీస్ గదిలోకి నడిచాను బిల్లు చెల్లించడానికి.

నర్స్ బిల్లు రాస్తూ, "పాపం కథలు రాయకుండా ఒక్కరోజైనా ఉండేవాడుకాదు. హాస్పిటలంతా నిద్రపోయాక రాత్రి ఏ ఒంటిగంటకో కూర్చుని రాసుకునేవాడు. అడిగితే అన్నింటికీ నవ్వే సమాధానం...." అంటోంది.

అతని మౌనం....

అతని గాంభీర్యం....

అతని బలహీనత....

అతని అపురూపమైన సాహితీ వ్యక్తిత్వం.... అన్నీ కళ్ళముందు కదలి....

ఒట్టి కన్నీళ్ళు....హృదయం నిండా కన్నీళ్ళు.

* * * *

తర్వాత రెండు రోజులకు-

ఆఫీస్‌లోకూర్చుని పెర్సనల్ టపాచూస్తుంటే- ఓ కవర్....రాత సుపరిచయమే....తిరగేస్తే- ఫ్రమ్ రాఘవయ్య....

చకాచకా చించి....

ప్రియమిత్రులు శ్రీ విశ్వనాథ్‌గారికి,

నమస్తే!

ముప్ఫయ్యేళ్ళుగా తెలుగు పత్రికలన్నీ నన్ను భరిస్తూ వచ్చాయి. ఎప్పుడూ నేనే మీకందరకూ బాకీ ఉంటూ వచ్చాను. ఈ బాకీనుండి విముక్తి కావాలని ఎప్పటికప్పుడు అనుకుంటూనే ఎప్పుడూ కాలేకపోయాను.

ఇక ఎవరికి బాకీ ఉండకూడదనే నిర్ణయించుకున్నాను....అందుకని దీనితోపాటుజతపరిచి రెండు కథల్ని...

ఇక చదువుకోలేకపోతున్నాను. కన్నీటి పొరగుండా అక్షరాలు కనిపించటంలేదు. క్రింద చనిపోవటానికి ముందు రెండురోజులనాటి తేదీ వేసి ఉంది.